రీ సర్వేతో తొలగిన భూసమస్యలు

- మోడల్ గ్రామంగా కొత్తూరు పూర్తి
- గ్రామానికి గెజిట్ సర్టిఫికెట్ అందించిన ప్రభుత్వం

రెవెన్యూ శాఖలో కొలతలు అంటేనే రైతులకు ఎనలేని చిక్కులు. భూమి హద్దులు ఏర్పాటు చేసుకోవడానికి గతంలో అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఒక్కోసారి కనికరించేవారు కాదు. మరోపక్క సమీప రైతులతో ఘర్షణ వాతావరణం ఉండేది. వీటన్నింటికీ ముగింపు పలకాలని జగనన్న ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా జగనన్న భూరక్ష పేరుతో భూముల రీసర్వేకు నడుంబిగించింది. విడతల వారీగా మండలాలను ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల పరిధిలోని భూములన్నింటినీ అధికారులు సర్వే చేసి సమస్యలను పరిష్కరించి కొత్తగా భూహక్కు పత్రాలు అందజేస్తున్నారు.


పెసరవాయి సమీపంలో హద్దు రాయి పాతుతున్న అధికారులు


సోమయాజులపల్లె సమీపంలో రోవర్‌తో కొలతలు వేస్తున్న దృశ్యం(ఫైల్)


గోరుకల్లులో భూ హక్కు పత్రాలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

పాణ్యం: భూ సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు 2020లో భూముల రీసర్వేను ప్రారంభించారు. అధునాతన 'రోవర్ మిషన్'తో రీసర్వే చేసి పైసా ఖర్చు లేకుండా హద్దులు ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ఒక రోజు ముందు రైతులకు నోటీసులు ఇచ్చి మరుసటి రోజు మిషన్ సాయంతో సర్వే చేస్తారు. రోజుకు 70 ఎకరాల పొలాలన్ని కొలుస్తున్నారు. అనంతరం ఏవైనా అభ్యంతరాల కోసం సమయం ఇస్తారు. ఆ తర్వాత హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్‌గా కొత్తూరు పూర్తి

మండలంలోనే అత్యంత తక్కువ విస్తీర్ణమున్న కొత్తూరు గ్రామాన్ని మొదటి విడతలో పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. 1,130 ఎకరాల విస్తీర్ణానికి 670 ఖాతాలు ఉన్నాయి. ఈ గ్రామాన్ని ఎంచుకున్న అనంతరం అధికారుల బృందం 6 నెలల పాటు కొలతలు వేశారు. రీ సర్వే కార్యక్రమానికి టీమ్‌గా రోవర్ మిషన్‌తో పాటు 3 సర్వేయర్లు, ఒక వీఆర్‌ఓ, ఇద్దరు వీఆర్‌ఏలు ప్రతి రోజు విధుల్లో ఉంటారు. రోవర్ మిషన్ శాటిలైట్ ద్వారా హద్దులను సూచిస్తోంది. ఇప్పటికే ఆరు గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా ప్రస్తుతం కొండ జూటూరులో కొనసాగుతోంది.

- కొండజూటూరు గ్రామంలో 1,934.84 ఎకరాల విస్తీర్ణం ఉండగా వీటిలో 707 ఖాతాలు ఉన్నాయి. గ్రామంలో రీ సర్వేను 15 రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.
- అలాగే నెరవాడ గ్రామంలో 2,839.07 ఎకరాల విస్తీర్ణం ఉండగా వీటిలో 883 ఖాతాలు ఉన్నాయి. నెరవాడ, అనుపూరు గ్రామాలు పూర్తయినా జేసీ లాగిన్‌లో ఉంచారు.

గ్రామానికి గెజిట్ సర్టిఫికెట్

ఏ గ్రామంలో అయితే రీ సర్వే పూర్తవుతుందో ఆ గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ సర్టిఫికెట్‌ను అందిస్తుంది. ఇప్పటికే ఆరు గ్రామాలకు గెజిట్ సర్టిఫికెట్ జారీ చేసింది. ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఈ సర్టిఫికెట్‌ను అతికించారు. దీంతో క్రయ విక్రయాలకు మరింత సులభతరం కానుంది.

ఆరు గ్రామాల్లో రీ సర్వే పూర్తి

గ్రామం	ఖాతాలు	విస్తీర్ణం	రాళ్లు
కొత్తూరు	670	1,130	1,000
తమ్మరాజుపల్లె	545	2,652.01	1,526
చిలకల	1,053	2,651.32	1,528
గోరుకల్లు	332	2,925.5	1,167
గోనవరం	950	2,012.58	1,256
కౌలూరు	645	2,349.33	1,375
కొండజూటూరు	707	1,934.84	1,209

పైసా ఖర్చు లేకుండా భూ సర్వే



ప్రభుత్వం తీసుకొచ్చిన రీ సర్వే ద్వారా రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా హద్దులు చూపిస్తున్నారు. గతంలో సర్వే అంటేనే రైతులు భయాందోళన చెందేవారు. రైతుల సమక్షంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. నాకున్న 11 ఎకరాల భూమిని కొలిచి హద్దురాళ్లు పాతి వెళ్లారు. – గుమ్మసాని క్రిష్టారెడ్డి కొత్తూరు గ్రామం

రోజు 70 ఎకరాల్లో రీ సర్వే

ప్రతి రోజు 70 ఎకరాలను రీసర్వే చేస్తున్నాం. ఆరుగురు రెవెన్యూ సిబ్బంది పాల్గొంటున్నారు. కొలతల సమయంలో రోవర్ మిషన్ ద్వారా కొలతలు వేస్తున్నాం. తర్వాత హద్దు రాళ్లు పాతిస్తున్నాం రైతుల నుంచి ప్రభుత్వం పైసా తీసుకోకుండానే రీసర్వే చేయించి ఒక్కో రాయికి రూ.650 ఖర్చు చేసి హద్దుల్లో ఏర్పాట్లు చేస్తోంది. కొలతల సమయంలో ఏమైనా సమస్యలు ఉంటే 15 రోజులకు ఒకటి, 30 రోజులకు మరో నోటీసు అందించి సమస్యలను పరిష్కారిస్తున్నాం.
– మహేశ్వరరెడ్డి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్

క్లుప్తంగా

మూలపెద్దమ్మ ఆలయంలో వేలం పాటలు


మూలపెద్దమ్మ ఆలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ అమ్మవారి ఆలయంలో వివిధ దుకాణాల ఏర్పాటు చేసుకునేందుకు శుక్రవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. సంవత్సరం పాటు టెంకాయలు, పూలు, పూల దండలు, పూజా సామగ్రి విక్రయించుకునేందుకు వేలం పాటలు నిర్వహించామని ఈఓ మోహన్ తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన యాదగిరి రూ.40 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ తలారి చిన్నన్న, ధర్మకర్తలు గువ్వల కేశవరావు, పూజారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆదోనిలో గ్రానెట్ ఆక్షన్ బ్లాక్‌ల తనిఖీ


కొత్త గ్రానెట్ ఆక్షన్ బ్లాక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 29లో కొత్త గ్రానెట్ ఆక్షన్ బ్లాక్‌ను తనిఖీ చేసి 2 హెక్టార్ల ప్రాంతాన్ని వేలానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆదోని మండలం దొడ్డనగేరి, బల్లేకల్లు గ్రామాల్లోని గ్రానెట్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ డీడీతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి


గడిగరేవుల గ్రామంలో అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం,విద్యార్థులు

గడివేముల: బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలని హెచ్‌ఎం రాజేంద్ర తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ వంద శాతం బడిబయట ఉన్న విద్యార్థులందరూ పాఠశాలలకు పంపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

బాలభారతిలో ఘనంగా సెమీ క్రిస్మస్


క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు

ఓర్వకల్లు: స్థానిక బాలభారతి పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ క్లమేట్ సత్యబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో యేసుక్రీస్తు, దేవదూతలు, శిష్యులు, క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సావ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం ఊరు ముందరి చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్‌ఐ పి. అశోక్ తెలిపారు. మృతురాలు పాణ్యం గ్రామానికి చెందిన ఆకుల శాంతమ్మ(84)గా గుర్తించినట్లు చెప్పారు. చెరువులో మృతదేహం తెలియాడుతుందనే విషయాన్ని స్థానికులు చెప్పడంతో మృతదేహాన్ని బయటకు తీసి విచారించామన్నారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

శాంతిరాం విద్యార్థుల ప్రతిభ

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సమితి నిర్వహించిన మండల స్థాయి వ్యాస రచన పోటీల్లో తమ కళాశాలకు చెందిన మంజుల వాణి, సాయి సుధలు అనర్గళమైన వ్యక్తీకరణ అనుభవాన్ని పొందారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మండల ప్రత్యేక అధికారి, సెట్కూరు సీఈఓ రమణ, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పీడీ, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలిబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు ముక్కోటి ఏకాదశి

- ఉత్తరద్వారం ప్రవేశానికి ప్రత్యేక ఏర్పాట్లు


వైకుంఠ ఏకాదశకి ముస్తాబవుతున్న కొరటమద్ది వేంకటేశ్వరాలయం

గడివేముల: ఏడాదికి ఒక్కసారి వచ్చే ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య జరుగనున్నాయి. ఈ మేరకు వైష్ణవాలయాలు ముస్తాబవుతున్నాయి. మండల పరిధిలోని బూజునూరు, పెసరవాయి, కొరమద్ది గ్రామాల్లో ఆలయాలను సుందరంగా అలంకరించారు. ఉత్తరం ద్వారం నుంచి ప్రవేశించి వేంకటేశ్వరుడిని దర్శించుకుంటే పాపహరణంతో పాటు సకల సౌభాగ్యాలు కలుగుతాయని ప్రతీతి. ముఖ్యంగా కొరటమద్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరాలయంలో భక్తులు ఉత్తరం ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు.

సరుకులు సక్రమంగా అందించాలి


బాలింతలకు సరుకులను అందిస్తున్న సూపర్ వైజర్ రాజమ్మ

గూడూరు రూరల్: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందజేసే పోషకాహార సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ సూచించారు. కె.నాగలాపురంలో శుక్రవారం బాలింతలు, పిల్లలకు టేక్ హోం రేషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో ఉన్నందున పోషకాహార పంపిణీ నిలిచిపోకుండా సచివాలయ మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించిందన్నారు. కె.నాగలాపురం, బూడిదపాడు, పెంచికలపాడు, చనుగొండ్ల, ఆర్.ఖానాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండవ విడత సరుకుల పంపిణీ చేపట్టామన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం


రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గడివేముల: మండల కేంద్రం గడివేముల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం గణిత పితామహుడు రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియల్, ఉపాధ్యాయులు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గణితశాస్త్రంలో రామానుజన్ కొత్తసిద్ధాంతాలు కనిపెట్టారని కొనియాడారు. అనంతరం గణిత క్విజ్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కొంతలపాడులో కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో ఈ నెల 24వ తేదీన రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పగిడ్యాల రాజు ఓ ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక స్టాంటన్ స్మారక తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలలో గెలుపొందిన విజేత జట్లకు నాలుగు స్థానాలకు వరుసగా రూ.10 వేలు, రూ.6,016లు, రూ.4,016లు, రూ.2,016ల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి క్రీడాకారులు అదే రోజు 9 గంటలలోపు రూ.200 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

కల్లూరు: కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్లోరోసిస్ వ్యాధిపై ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగడం వలన దంత ఫ్లోరోసిస్, కీళ్ల నొప్పులు, ఎముకలు దెబ్బతినడం, బోలు ఎముకల వ్యాధి, కండరాల నష్టం, అలసట, దీర్ఘకాలిక సమస్యలు వస్తాయన్నారు. ఫ్లోరిన్ ఎక్కువగా ఉన్న ఆహారం, నీటి వల్ల జీర్ణాశాయ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపురం యూపీహెచ్‌సీ వైద్యాధికారిని జ్యోతి, సీహెచ్‌ఓ సురేష్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డిలో ఘనంగా ఫ్రెషర్స్ డే

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, టి.జి భరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కన్నా కుమార్, విజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈనెల 25 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న క్రీడాకారులను శుక్రవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో జట్టు కోచ్ ఫిజికల్ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే


సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రీ సర్వేలో తమ భూముల వివరాలు తప్పుగా నమోదవటం, తక్కువ భూమిని రికార్డులో నమోదు చేయడం, ఒకే పాసు పుస్తకంలో కొంత మంది రైతులకు హక్కులు కల్పించడం వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. రీ సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే ప్రత్యేక రెవెన్యూ సదస్సును నిర్వహించి, భూ సమస్యలున్న వారి వివరాలను నమోదు చేసుకుని, సంబంధిత రికార్డుల మేరకు సవరణలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వివరాలను సరి చేయాలని తహసీల్దార్ సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు ఉన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా ఫలితాలు సాధించాలి

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు కల్చరల్: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో కోడుమూరు నియోజకవర్గంలోని ఎంఈఓలతో నాడు నేడు రెండో విడత పనులపై సమీక్ష నిర్వహించారు. పనులు నాణ్యతతో త్వరిత గతిన పూర్తి చేయించాలన్నారు. పాఠశాలల్లో ప్రతి విద్యార్థి బెంచీపై కూర్చునేలా సౌకర్యాలు కల్పించాలన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ తదితరులు

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని ఉల్చాల జెడ్పీహెచ్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మండల ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఈఓ ఆజాం ఖాన్, ఎంఈఓ వినోద్‌కుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు డి.వాసు, గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

రైతుల అభ్యున్నతికి ఎస్‌బీఐ ఆర్థిక తోడ్పాటు

- జాతీయ రైతు దినోత్సవం కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖమీనన్


అభ్యుదయ రైతును సత్కరిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా భారతీయ స్టేట్ బ్యాంక్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని కర్నూలు ఎస్‌బీఐ పరిపాలన కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖమీనన్ తెలిపారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌బీఐ బ్రాంచీల్లో అన్నదాత దివస్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రైతు దినోత్సవం శనివారం ఉంది. ఆ రోజు బ్యాంకులకు సెలవు కావడంతో ఒక రోజు ముందుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యుదయ రైతులను సత్కరించారు. వెంకటరమణ కాలనీలోని పరిపాలన కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ దివస్ లో డీజీఎం లేఖామీనన్ మాట్లాడుతూ... రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందించే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఎల్ఎం/ఎస్ఆర్ఎల్ఎం భాగస్వామ్యంతో ఎస్‌బీఐ పని చేస్తోందని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై అవగాహన పెంచి బ్యాంకింగ్ వ్యవహారాలను రైతుల ముంగిటకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు ఎస్‌బీఐ శాఖల ద్వారా రుణ, పొదుపు ఖాతాలను అందిస్తున్నట్లు వివరించారు. యోనో కృషి ద్వారా, వన్-స్టాప్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేయడానికి అగ్రిగోల్డ్‌లోన్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బ్రాంచీ మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించేందుకే ఈ-మిర్చా ప్రాజెక్టు

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి, టమాట సాగులో ఉత్పాదకత పెంచడానికి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేసేందుకు ఈ-మిర్చా 2.0 ప్రాజెక్టును ప్రారంభించినట్లు జిల్లా ఉద్యాన అధికారి పి.రామంజనేయులు తెలిపారు. శుక్రవారం కర్నూలులోని ఉద్యానభవన్‌లో జిల్లాలోని ఉద్యాన అధికారులు, ఉద్యాన సహాయకులకు జిల్లా ఉద్యానశాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిర్చి, టమాట సాగులో రైతులకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ ఉత్పాదకతను పెంచడంతో పాటు... పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఉద్యాన శాఖ డిజిటల్ గ్రీన్ ఆర్గనైజేషన్‌తో కలసి పని చేస్తోందన్నారు. ఈ-మిర్చా 2.0 ప్రాజెక్టు ద్వారా రైతులకు సాంకేతిక సలహాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయా పంటలు సాగు చేసే రైతులతో వాట్సాప్ గ్రూపులు కూడా ఏర్పాటు చేయించాలన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు మస్తాన్ వలీ, వెంకటసాయి మాట్లాడుతూ... ఈ-మిర్చా ప్రాజెక్టు విశిష్టతను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో సాంకేతిక ఉద్యాన అధికారి అనూష, ఇతర ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

కర్నూలు(లీగల్): శాశ్వత లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజుబాబు పేర్కొన్నారు. తన సతీమణి మృతికి కారణమైన బాలాజీ నర్సింగ్ హోమ్‌పై కండి ప్రసాద్ అనే వ్యక్తి లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాడు. ఆసుపత్రి నిర్వాహకులకు నోటీసు జారీ చేసి పిలిపించి లోక్‌అదాలత్ చైర్మన్, సభ్యులు మాట్లాడారు. దీంతో ఫిర్యాది కండి ప్రసాద్‌కు మానవతా సహాయం కింద రూ.6 లక్షలు ఇచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించడంతో వివాదం పరిష్కారమైంది. ఇరు పార్టీల న్యాయవాదులు కె.బలరాముడు, టి.మురళీధర్ పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం!

- నేటి నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నంది నాటక పోటీలు
- జిల్లా నుంచి రెండు పద్య నాటకాలు ప్రదర్శన



కర్నూలు కల్చరల్: ప్రభుత్వం కళాకారులకు అండగా నిలబడుతోంది. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తుంది. ఈ క్రమంలో ఏపీ స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు గుంటూరులోని రాష్ట్రస్థాయి నంది నాటక పోటీలు నిర్వహిస్తుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో పద్య, సాంఘిక నాటకాలతో పాటు బాలల నాటికలు మొత్తం 38 ప్రదర్శితం కానున్నాయి. ఇందులో జిల్లా నుంచి రెండు పద్య నాటకాలు ఉన్నా యి. ఈనెల 26వ తేదీ సాయంత్రం టీజీవీ కళాక్షేత్రం నాటక సమాజం వారి శ్రీకృష్ణ కమల పాలిక, 29వ తేదీ ఉదయం కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం వారి ఆనంద నిలయం నాటకాలు ప్రదర్శితం కానున్నాయి.

జిల్లాకు నందుల పంటే

1998లో నంది నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి కర్నూలు లలిత కళా సమితి/ టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం, నంద్యాల కళారాధన సంస్థలు కొత్త తరహాలో నాటకాలను రూపొందించి ప్రదర్శిస్తూ నంది పురస్కారాలను కైవసం చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు జిల్లా నాటక సమాజాలకు సుమారు 55 దాకా నంది పురస్కారాలు వరించి ఉంటాయి. ఇందులో 25 దాకా బంగారు నంది పురస్కారాలు ఉండటం విశేషం. లలిత కళా సమితి ఆధ్వర్యంలో రాయలసీమ ముఠా కక్షలపై పులిస్వారీ నాటకం 130 ప్రదర్శనలు ఇచ్చి సంచలనం సృష్టించింది. ఇదే సంస్థ అత్యధికంగా 37 నంది అవార్డులు సాధించింది. రాష్ట్రంలోనే అత్యధిక నంది పురస్కారాలు జిల్లా కళాసమాజాలు కైవసం చేసుకుని కళలకు కందనవోలు నిలయం అనే నానుడిని నిజం చేస్తున్నాయి.

గతానికి భిన్నం.. కళాకారులు హర్షం

గతంలో జరిగిన నంది నాటకాల తీరు ఒక విధంగా ఉంటే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని మురళి కృష్ణ పర్యవేక్షణలో జరుగుతున్న నంది నాటక పోటీలు ప్రత్యేకంగా నిలవన్నుయి. రాష్ట్రంలోని కళా సమాజాల వారిని ఆహ్వానించి వారి సలహాల సూచనలు తీసుకొని నాటక పోటీల నిర్వహణ చేపట్టారు. నాటక ప్రదర్శనల తేదీలను లాటరీ ద్వారా ఎంపిక చేయడం, నిష్ణాతులైన న్యాయ నిర్ణేతలు, కళా కారులకు ప్రముఖ హోటల్స్/లాడ్జిలలో వసతి ఏర్పాటు (గతంలో ప్రభుత్వం పాఠశాలల్లో వసతి), నాటకాల ప్రదర్శనలకు సంబంధించి టెక్నికల్‌గా ఏ నాటకానికి ఏ సెట్టింగ్, లైటింగ్ వివరాలను నాటక సమాజాల వారితో మాట్లాడి ఏర్పాటు చేయించండం, స్వయంగా చైర్మనే కళాకారులను ఆహ్వానించి శాలువా, పూల హారాలతో సన్మానం చేస్తుండటంతో కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నంది నాటక పోటీల ద్వారా కళాకారులను ప్రోత్సాహించడం శుభపరిణామమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.వి. రమణారెడ్డి పేర్కొన్నారు.